క్లుప్తంగా

మరిడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మరిడమ్మ తల్లికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి అరుణ కిరణ స్పర్శ



స్వామి వారిపై ప్రసరించిన సూర్య కిరణాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రసిద్ధిగాంచిన శివాలయంలో శుక్రవారం అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. శ్రీ పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వర దేవాలయంలో శుక్రవారం సాయంత్ర స్వామి వారిపై సూర్య కిరణాలు ప్రసరించి పసిడి వెలుగులతో దర్శనం ఇచ్చారు. ఆలయ రాజ గోపురం, ముఖ మండపం, నందీశ్వర అంతర ఆలయం దాటి గర్భాలయంలో స్వామి వారిపై కిరణాలు పడటం విశేషంగా ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయ అర్చకులు వీరబాబు, దత్తు సోదరులు స్మార్త విద్యార్థుల పండిత బృందంతో మహాసౌరం పారాయణ చేయడంతో భక్తులు ఈ దృశ్యాలు చూసి తన్మయత్వం చెందారు. ఆలయ సేవా సభ్యులు మాట్లాడుతూ సంవత్సరానికి రెండు సార్లు. ఉత్తరాయణంలో ఒకసారి, దక్షిణాయనములో ఒకసారి సూర్యకిరణాలు స్వామివారిపై పడతాయని తెలిపారు.

జాబ్ మేళాలో 52 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

పిఠాపురం: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 52 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ఈ మేళాలో టీమ్‌లీజ్, పైటీఎం, ఎల్‌ఐసీ సంస్థలు పాల్గొన్నాయని వారు తెలిపారు. మొత్తం 142 మంది జాబ్‌మేళాకు హాజరు కాగా 52 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళి, ఇతర అధికారులు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంగ్లిషు పరీక్షకు 9 మంది గైర్హాజరు

సామర్లకోట: పదో తరగతి ఇంగ్లిషు పరీక్షకు శుక్రవారం 9 మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణ తెలిపారు. 1499 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1490 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. 10 పరీక్షా కేంద్రాలలోను ప్రశాంతంగా పరీక్షలు జరిగాయన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేయగా ఆరోగ్య సిబ్బంది ఆయా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను నిర్వహించారన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి న ర్శింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు కనకదుర్గ అమ్మవారికి చండీహోమం

కొండ దిగువన తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం 'మూల'సందర్భంగా శనివారం చండీహోమం నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారు.

వ్యయసాయం..!

- తెగుళ్లతో రైతుల గగ్గోలు
- కంగారు వద్దంటున్న అధికారులు
- సూచనలు పాటించాలని సలహా

పిఠాపురం: సాగునీరందక నాట్లు వేసేందుకు పాట్లు పడిన రైతులకు విజృంభిస్తున్న తెగుళ్ల మోయలేని భారాన్ని మోపుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రబీ సాగులో ప్రస్తుతం వరిపైరుపై దోమ, అగ్గితెగులు, పసర పురుగు, ఆకుచిట్టు పురుగు, దుబ్బు కుళ్లు, రసం పీల్చుపురుగు వంటి వ్యాధులు, పురుగులు విజృంభిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. నాట్లు వేసిన నాటి నుంచి తెగుళ్లకు రసాయన మందుల పిచికారీకి రైతుపై అదనపు భారం పడుతోంది. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ నాట్లు ఆలస్యం కావడంతో పాటు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో వ్యాధులు పెరగడానికి కారణంగా రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా వెదజల్లే పద్ధతిలో వేసిన వరిపై వ్యాధుల తీవ్రత అధికంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. అలాగే పొట్టదశకు చేరిన వరిపైరు పైనా కొన్ని తెగుళ్లు ఆశించడంతో పురుగు మందులు పిచికారీ చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. అయితే ఎన్ని మందులు వాడినా వ్యాధుల తీవ్రత తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం పురుగులు అధికంగా ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందని వ్యాధులు అంతగా వ్యాపించవని నాట్లు ఆలస్యం కావడం వల్ల కొంత ఇబ్బంది తప్ప ఎటువంటి వ్యాధులు లేవని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. అధికారుల సూచనలు, సలహాలు లేకుండా ఎటువంటి పురుగు మందులు పిచికారీ చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. కానీ వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉందని మందులు పిచికారీ చేయకపోతే ఇబ్బందులు తప్పవని రైతులు అంటున్నారు.

అవగాహన లోపంతో అగచాట్లు

వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించి తగిన పురుగు మందులు వాడడం వల్ల నష్టాలు నివారించుకోవాలి. ప్రస్తుతం సాగునీటి సమస్య వల్ల తెలుగుళ్లు విజృంభించే అవకాశం ఉంది. దాని వల్ల వివిధ పురుగులు ఎక్కువగా ఆశిస్తాయి. దానితో పాటు కాండం తొలిచే పురుగు, రెక్కల పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. దుబ్బు తయారయ్యే ముందు, పొట్టదశలోను ఈ తెగుళ్లు, పురుగులు ఆశించి పంటలకు తీవ్ర నష్టాలకు గురిచేస్తాయి.



పొలంబడి ద్వారా రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

సూచనలు పాటించండి

ఎక్కువగా వరిపైరు ఆకుల చివర రెక్కల పురుగు గుడ్లు కనిపిస్తాయి వాటిని జాగ్రత్తగా గమనించాలి అవి ఎక్కువ వరిదుబ్బులకు ఆశించి ఉంటే వెంటనే వ్యవసాయశాఖాధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు పురుగు మందులు పిచికారీ చేయాలి. ఏ తెగులు ఆశించినట్టు గుర్తించినా వెంటనే ఇష్టమొచ్చినట్టు పురుగు మందులు వాడకుండ కేవలం ఏ తెగులు సోకిందో అధికారుల ద్వారా నిర్ధారించుకుని ఆ తెగులుకు సంబంధించిన మందులు తగిన మోతాదులో ఉపయోగించాలి. దీనివల్ల పెట్టుబడి తగ్గడంతో పాటు పంటలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ప్రతి మందుతో పాటు వేప కషాయం తప్పని సరిగా కలుపుకోవడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. రాబోయే తెగుళ్లు నివారించబడతాయి. ప్రస్తుతం పిఠాపురం నియోజకవర్గంలో ఎక్కడా తెగుళ్లు అంతగా కనిపించడం లేదు. అయినప్పటికీ కొందరు రైతులు ఇష్టమొచ్చినట్లు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. అలా చేయడం వల్ల పెట్టుబడి పెరుగుతుంది తప్ప వ్యాధులు నివారణ కావు.

– పి.స్వాతి, ఏడీఏ, పిఠాపురం

అంగన్‌వాడీలకు కొనసాగుతున్న శిక్షణ



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సిబ్బంది

పిఠాపురం: గొల్లప్రోలు మండలం వన్నెపూడి జెడ్పీ హై స్కూల్‌లో మండల స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం రెండోరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పిఠాపురం ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవి మాట్లాడుతూ మూడు రోజులు పోషణ్ భీ పఢాయి భీ కార్యక్రమంపై శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. సున్నా నుంచి మూడేళ్ల లోపు పిల్లల ఎదుగుదలను నవచేతన అని, తరువాత మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల అభివృద్ధిని ఆదర్శిల అనే పేరుతో వీటి అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలలో ఎలాంటి కార్యక్రమాలు రూపొందించాలనే దానిపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పిల్లల ఎదుగుదల, పోషణ, పౌష్టికాహారం తదితర విషయాలపై దుర్గాదేవి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగమణి, మానసదేవి, మణి, దేవ కుమారి పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప జెడ్పీ పాఠశాలలో పిల్లల్లో పౌష్టికాహార లోపంపై శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవి అనంతలక్ష్మి నవజాతి శిశువు సంరక్షణ, బరువు తక్కువ పిల్లలు, తల్లి పాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు అనంతలక్ష్మి, శ్రీదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన అవసరం



శాంతివర్ధనలో పండ్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



భవిత కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

పెద్దాపురం: జన్యుపరంగా సంభవించే లోపాల వల్ల కలిగే చాలా మంది పిల్లలు డౌన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నారని శాంతివర్ధన విభిన్న ప్రతిభాంతుల పాఠశాల నిర్వాహకులు రాయవరపు వీరబాబు, సత్య అన్నారు. మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో శుక్రవారం వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబాబు, సత్య మాట్లాడుతూ జన్యుపరమైన క్రోమోజోమ్స్ వల్ల వచ్చే ఈ సమస్య పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలన్నారు. వివాహాలు ఆలస్యంగా చేసుకోవడం, బాల్య వివాహాల వల్ల క్రోమోజోములు సరైన మోతాదులో సంపర్కం జరుగక పోవడం ప్రధాన కారణమన్నారు. తొలుత దీనిని కనుగొన్న జాన్ లాంగ్ డౌన్ చిత్రపటం వద్ద చిన్నారులు నివాళులర్పించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏటి వేణు, అప్పలరాజు, ఆర్.చంటి, దుర్గావీరబాబు, శివ, శ్రీనివాస్, సరోజిని, విశాల, రాజేంద్ర, తదితరలు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో

మండలంలోని భవిత కేంద్రంలో శుక్రవారం వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే నిర్వహించారు. భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో హెచ్ఎం శివజ్యోతి విభిన్న ప్రతిభావంతులతో కలిసి కేక్‌ను కట్ చేశారు.

మోటారు సైకిల్‌పై విన్యాసాలు

- అదేమని ప్రశ్నించినందుకు ఇద్దరిపై దాడి
- గొలుసు చోరీ చేసి యువకుల పరారు
- గొల్లప్రోలు హైవేపై ఘటన

పిఠాపురం: నిత్యం రద్దీగా ఉండే గొల్లప్రోలు 216 జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌పై విన్యాసాలు చేస్తూ ఇతర వాహనచోదకులను భయభ్రాంతులకు గురి చేసిన కొందరు యువకులు ఇదేం పని అని అడిగిన ఇద్దరిపై దాడి చేసి వారి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన మురాలశెట్టి సూర్యతేజ పాల వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం మధ్యాహ్నం పిఠాపురంలో పాలు విక్రయించి తిరిగి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. తాటిపర్తి జంక్షన్ దగ్గరకు వచ్చే సరికి ఇద్దరు యువకులు ఒక మోటారు సైకిల్‌పై నడి రోడ్డు మీద అడ్డదిడ్డంగా బండి నడుపుతూ ఎదురుగా వచ్చే వారిని ఆందోళనకు గురి చేస్తున్నారు. దీంతో సూర్యతేజ వారిని ఆపి మందలించాడు. అయినప్పటికీ వారి అదే తెంపరితనంతో అతనిపైకి దూసుకువచ్చే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడకు వచ్చిన తాటిపర్తికి చెందిన మరో వ్యక్తి పేకేటి ప్రసాద్ సైతం వారిని మందలించడంతో వారిరువురితో ఆ యువకులు వాగ్వాదానికి దిగారు. ఇంతలో అక్కడకు మరో మోటారు సైకిల్‌పై వచ్చిన మరి కొందరు యువకులు వారిని ప్రశ్నించిన వ్యక్తులపై దాడికి దిగి సూర్యతేజ మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. దీనిపై బాధితులు ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదుపై గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చైతన్య దీప్తి..చరఖా



చరఖా తయారు చేస్తున్న సీతాంబరం

పిఠాపురం: స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేయడానికి మహాత్మా గాంధీ ఉపయోగించిన చరఖా తన రూపాన్ని మార్చుకుంది. కాలంతో పాటు చెక్కతో కాకుండా సైకిల్ చక్రాలతో తయారు చేసిన చరఖాలు వినియోగంలోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో కొత్తపల్లికి చెందిన వడ్రంగి మేస్త్రీ సీతాంబరం పాత కాలపు చరఖా తయారు చేశారు. దానిని చూసిన ప్రతి ఒక్కరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే దానిని నేత పనికి కాకుండా పాతకాలపు చరఖాగా ఇంటిలో పెట్టుకోవడానికి తయారు చేసినట్టు ఆయన తెలిపారు.

తాగునీటి ఎద్దడిని నివారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలలిత

పెద్దాపురం: వేసవి దృష్ట్యా ఆయా పంచాయతీల్లో తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీలలిత ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీలలిత మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయాలన్నారు. పీ4 విధానంపై మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 22న వాటర్ డే కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు తాగు నీటి సరఫరాపై అవగాహన కల్పించాలన్నారు. నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం గ్రామ సభల నిర్వహణ, పంచాయతీ పాలనాతీరు, ప్రభుత్వ రుణ సౌకర్యం వంటి అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రమణ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గణపతిరావు, సందీప, ఎ.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



పాఠశాల అభివృద్ధిపై సమీక్షిస్తున్న పీడీ చైత్ర వర్షిణి

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పాడా పీడీ చైత్ర వర్షిణి అన్నారు. మండలంలో మూలపేటలో ఉన్న జెడ్పీ పాఠశాలను ఆమె సందర్శించారు. స్థానికులు, అధికారులతో ఆమె సమీక్షించారు. ఆమె వెంట ఏపీడీ పి.వసంత మాధవి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెద్దాపురం.. తూర్పుగోదావరిలో!



పెద్దాపురం తహసీల్దార్ కార్యాలయంపై ఉన్న పాత బోర్డు

పెద్దాపురం: జిల్లాల పునర్విభజన జరిగి రోజులు గడుస్తున్నా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే పెద్దాపురం ఉందా..? అంటే రెవెన్యూ శాఖ మాత్రం ఉమ్మడి తూర్పులోనే ఉన్నట్లుగా కార్యాలయ బోర్డును కొనసాగిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ కార్యాలయాలకు జిల్లాల పునర్విభజనలో పెద్దాపురం కాకినాడ జిల్లాగా మారినప్పటికీ ఆ ప్రభుత్వ ప్రధాన కార్యాలయాన్ని మాత్రం తూర్పుగోదావరి జిల్లాగా ఉంచేడయంపై చూపరులు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రభుత్వ పరిపాలనా విభాగంలో ప్రధాన శాఖ అయిన రెవెన్యూ అధికారులే బోర్డులు సరిచేయడంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వ కార్యాలయ భవనంలోకి వచ్చే వారికి మాత్రం కాకినాడ జిల్లాగా బోర్డు ఉన్నప్పటికీ ప్రధాన రహదారి వైపు మాత్రం ప్రభుత్వ కార్యాలయ బోర్డు పాత జిల్లాలోనే ఉన్నప్పటికీ సంబంధిత రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకూ పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కొత్తపల్లి: రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకూ పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మండలంలోని కొమరగిరిలో గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిని కొంతమంది కబ్జా చేయడంపై శుక్రవారం సీపీఐ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూపోరాటం నిర్వహించారు. అనంతరం ఇళ్ల స్థలాలు లేని లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిని కబ్జా చేస్తే అధికారులు పట్టించుకోకపోవడానికి కారణమేమిటని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు సైతం కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఉద్దేశంతో ఫేజ్-2లో 72ఎకరాల భూమిని రూ.32 కోట్లు వెచ్చించి కొనుగోలు చేశారన్నారు. దానిలో కొంతవరకూ మెరక చేశారని, అయితే సుమారు 42 ఎకరాలను మెరక చేయకపోవడంతో కొంతమంది కబ్జాచేసి సాగు చేసుకుంటున్నారన్నారు. వారికి అధికారులు కొమ్ము కాస్తున్నారన్నారు. కొమరగిరి భూమి విషయంపై త్వరలో ఉపముఖ్యమంత్రిని, రెవెన్యూ మంత్రిని కలుస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ స్థలం వద్దకు వచ్చి పేదల నుంచి 1,400 ఇళ్ల స్థలాల దరఖాస్తులను స్వీకరించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగా ప్రసాద్ మాట్లాడుతూ అధికారులు భూమిని పేదలకు పంచాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, కేశవరపు అప్పలరాజు, మహిళ సమాఖ్య జిల్లా కన్వీనర్ భవాని, సమాచార హక్కుల వేదిక నాయకుడు బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఆదరణ రుణాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేనేజర్ కనకరాజు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని బీసీలకు వారి కుల వృత్తులను అభివృద్ధి చేసుకోవడానికి ఆదరణ పథకంలో పరికరాలకు సంబంధించి రుణాలు అందజేయనున్నట్టు మున్సిపల్ మేనేజరు కనకరాజు తెలిపారు. శుక్రవారం మెప్మా కార్యాలయంలో బీసీల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చేతి వృత్తులు చేసుకునే వారికి సాంకేతిక పరమైన పోటీ ఏర్పడటంతో ఆ పోటీని తట్టుకునేలా యంత్రాల కొనుగోలుకు రుణాలు ఇస్తున్నట్టు తెలిపారు. పట్టణ బీసీ సంఘ నాయకుడు వాడపర్తి వీరభద్రరావు మాట్లాడుతూ రజకులు, తాపీ పనివారు తమ వృత్తిలో మరింత నైపుణ్యంతో ఆదాయం పొందడానికి వచ్చిన యంత్ర పరికరాలను ఉపయోగించుకుని వారి కుటుంబ ఆదాయం పెంచుకోవాలని సూచించారు. ఈ మేరకు బీసీలు సంఘాలుగా ఏర్పడితే సులభంగా యంత్ర పరికరాలకు రుణాలు అందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, మెప్మా సీఓలు ప్రసాద్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంట భూమిలో లేఅవుట్

- ఉండూరులో రియల్ దందా
- ఇప్పటికే విక్రయాలు ప్రారంభం
- చోద్యం చూస్తున్న అధికారులు



పంట భూమిలో అనధికారికంగా వేసిన లే అవుట్

సామర్లకోట: మండల పరిధి ఉండూరు పంచాయతీ పరిధిలో అనధికార లే అవుట్లు పెరిగి పోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉండూరు శివారు నుంచి పి. వేమవరం వెళ్లే రోడ్డులోని కూడలిలో అనధికారిక లే అవుట్ వెలసినా పంచాయతీ, కొడా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే నాలుగు ప్లాట్లను విక్రయించారని స్థానికులు చెప్తున్నారు. వ్యవసాయ భూమిని ఎటువంటి అనుమతులు లేకుండా లే అవుట్ వేస్తుంటే అధికారులు మౌనంగా ఉండడం ఆశ్చర్యంగా ఉందని వారంటున్నారు. భూమి లే అవుట్ చేసే సమయంలో ఎకరానికి 10 సెంట్ల భూమిని పంచాయతీకి రిజర్వ్ స్థలంగా కేటాయించాలి. అదేమీ లేకుండా లేఅవుట్‌లో గజం రూ.ఆరు వేల నుంచి రూ.7 వేలకు విక్రయిస్తున్నారు. కొడా నిబంధనల ప్రకారం 30 అడుగుల రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా 20 అడుగుల రోడ్లకు మాత్రమే స్థలం వదిలారు. అక్రమ లే అవుట్ ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వైనానికి చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శి బుల్లియ్యకాపును ఈ విషయమై వివరణ కోరగా అనధికార లే అవుట్ విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే బోర్డులు ఏర్పాటు చేశామని చెప్పారు. దీనితో పాటు లేఅవుట్‌దారుకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. అనుమతులు లేకుండా లే అవుట్ చేయడంతో అటువంటి స్థలాలు కొనుగోలు చేస్తే ప్లాను ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు. ఈ మేరకు అనధికార లే అవుట్‌లో గురువారం ఫ్లెక్స్ ఏర్పాటు చేశారు. అలాగే నీటిపారుదల శాఖ అనుమతులు లేకుండా పంట కాలువకు తూరలు ఏర్పాటు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.



లే అవుట్ వద్ద హెచ్చరికతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన పంచాయతీ అధికారులు, వీఆర్వో



పంట కాలువలో ఏర్పాటు చేసిన తూరలు

సారా రహిత గ్రామంగా వాకలపూడి

- నవోదయం 2.0 కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డీసీ చైతన్య మురళి

కాకినాడ రూరల్: సారా రహిత గ్రామంగా వాకలపూడిని తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు సహకరించాలని ఎక్సైజ్ శాఖ డీసీ వై.చైతన్య మురళి పిలుపు ఇచ్చారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వాకలపూడి పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేసేందుకు నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సారా తాగడం వలన అనర్థాలు, సారా తయారీ, విక్రయం వంటి చట్ట విరుద్ధ పనులు నిర్వహించడం వల్ల పడే శిక్షల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. నాటు సారా విక్రయించే గ్రామాలలో వాకలపూడి ఉందని, ఈ గ్రామం సి – గ్రేడ్‌లో ఉందన్నారు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి మాట్లాడుతూ గ్రామంలో సారా తయారీ, విక్రయం జరిపే వారి వివరాలు టోల్ ఫ్రీ నంబరు 14405 ద్వారా తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో నార్త్ స్టేషన్ సీఐ రామ్మోహన్, ఎస్సై వరహాలు, రూరల్ ఎంపీడీఓ పి.సతీష్, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ డీసీ చైతన్య మురళి, ఏసీ రేణుక, సూపరింటెండెంట్ కృష్ణకుమారి తదితరులు